

ఠాణాలను సందర్శించిన శంషాబాద్ డీసీపీ

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కడ్తాల్, తలకొండపల్లి ఠాణాలను శుక్రవారం శంషాబాద్ డీసీపీ రాజేశ్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్లలోని రికార్డులను పరిశీలించారు. అక్కడి పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్లకు వచ్చే వారితో మర్యాదగా వ్యవహరించాలని.. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఆయన వెంట శంషాబాద్ డీసీపీ రామ్‌కుమార్, ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్, తలకొండపల్లి ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ నిరంజన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. -కడ్తాల్, జూన్ 21

# ఆయిల్ పామ్‌తో అధిక ఆదాయం

**వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్**

తాండూరు, జూన్ 21 : ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు వస్తున్నాయని వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఉద్యానవన, ఆకోపామ్ ఆయిల్ అండ్ ఫ్యాట్స్ ప్రైవేట్ ఇండస్ట్రీస్ సంయుక్తాధ్వర్యంలో ఆయిల్‌పామ్ పంటలపై అవగాహన సదస్సు జరిగింది. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ..ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధికంగా లబ్ధిపొందుతున్నారన్నారు. ఈ పంటను సాగు చేసిన రైతులకు మూడు నుంచి ఐదేండ్ల కాలంలో ఆదాయం రావడం ప్రారంభమవుతుందన్నారు. తెలంగాణ ప్రాంత నేలలు ఈ పంటసాగుకు ఎంతో అనుకూలమన్నారు. అంతరపంటల సాగుతోనూ మరింత ఆదాయాన్ని పొందొచ్చన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్



## ధ్యానం చేసి.. యోగాసనాలేసి..

ధ్యానం, యోగాను ప్రతి ఒక్కరూ జీవితంలో భాగం చేసుకోవాలని రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ అన్నారు. మండలంలోని కన్హాశాంతివనంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రంలో అభ్యాసీలతో కలిసి కొద్దిసేపు ధ్యానంచేసి.. యోగాసనాలు వేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన గ్రీనరీ, ఆహ్లాదకర వాతావరణం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి 2000 మంది అభ్యాసీలు పాల్గొన్నారు. -నందిగామ, జూన్ 21

## షాద్‌నగర్‌లో జయశంకర్ విగ్రహావిష్కరణ



షాద్‌నగర్, జూన్ 21 : తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలో ఎమ్మెల్యే శంకర్, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీజేఏసీ షాద్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ ముఖద్వారం వద్ద ప్రొఫెసర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఇందులో భాగంగానే ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ టీజేఏసీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పంటల వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలి

**రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి గీతారెడ్డి**

షాబాద్, జూన్ 21 : రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో పకడ్బందీగా నమోదు చేయాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి గీతారెడ్డి ఏఈవోలను ఆదేశించారు. శుక్రవారం ఆమె మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి మాట్లాడారు. ఈ వానకాలంలో రైతులు సాగు చేసిన పంటల ను సర్వేనంబర్ల వారీగా పకడ్బందీగా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలన్నారు. జిల్లాలో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సరిపడా అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో షాబాద్ క్లస్టర్ ఏఈవో రాజేశ్వరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి గీతారెడ్డి

## 'నీట్' లీకేజీలో బీజేపీ నాయకుల హస్తం

**ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి**



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి

తుర్కయాంజాల్, జూన్ 21 : నీట్ పేపర్ లీకేజీలో బీజేపీ నాయకుల హస్తం ఉందని .. ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. శుక్రవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన ఐద్వా రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశంలో మల్లు లక్ష్మి పాల్గొని మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీలో బీజేపీ నాయకుల హస్తం ఉందని ఆరోపించారు. పేపర్ లీకేజీతో 24 లక్షల కుటుంబాలు తమ పిల్లల భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్నాయన్నారు. లీకేజీలో బీజేపీ నాయకుల పాత్ర ఉందని దేశవ్యాప్తంగా ఆరోపణలు వస్తున్నా.. ప్రధాని మోదీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయమ్మ, సుమలత, జిల్లా నాయకులు ఉమ, స్వప్న, అనురాధ, సంధ్య, మస్తాన్, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.



## వర్సిటీ ఏర్పాటుకోసం భూముల పరిశీలన

కడ్తాల్, జూన్ 21 : కల్వకుర్తి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో శుక్రవారం మండలంలోని ప్రభుత్వ భూములను కందుకూరు ఆర్డీవో సూరజ్‌కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు పరిశీలించారు. అన్మాస్‌పల్లి గ్రామ శివారులోని సర్వేనంబర్లు 260/29, 321లో ఉన్న ప్రభుత్వ భూములను అధికారులు పరిశీలించారు. ఆయా సర్వేనంబర్లలో దాదాపు 80 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించారు. భూములకు సంబంధించిన పూర్తి నివేదికలు తయారు చేసి ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. అదే విధంగా మండలంలో ధరణికి సంబంధించిన భూసమస్యలను పరిష్కరించాలని ఆర్డీవోకు నాయకులు సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ ముంతాజ్, మాజీ సర్పంచ్‌లు నర్సింహ, శంకర్, డీఐ కృష్ణయ్య, సర్వేయర్ పాండు రంగారెడ్డి, ఆర్ఐ వాహిద్, భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌అలీ, బాలరాజు, రవి, రాజేశ్ పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

షాబాద్, జూన్ 21 : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత అన్నారు. శుక్రవారం మండలంలోని రుద్రారం, చందనవెల్లి, హైతాబాద్ ప్రభుత్వ పాఠశాలల్లో దాత బొంతపల్లి విద్యా సాగర్ సుమారు 500 మంది విద్యార్థులకు నోట్‌బుక్కులు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మానవతాదృక్పథంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్కులు, పెన్నులు అందించడం సంతోషకరమన్నారు. విద్యార్థులు బాగా చదివి తల్లిదండ్రులు, పాఠశాలలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పుస్తకదాత విద్యాసాగర్, స్థానిక ఎంపీపీ ప్రశాంతిరెడ్డి, చందనవెల్లి, హైతాబాద్ గ్రామాల మాజీ సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, మల్లేశ్, వీరయ్య, వీరేశ్, పూర్ణచందర్, నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ఫరూఖ్‌నగర్‌లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్


## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

షాద్‌నగర్, జూన్ 21: షాద్‌నగర్ మున్సిపాలిటీ ఫరూఖ్‌నగర్ హరిజనవాడ ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. బీఆర్‌ఎస్ యువ నాయకుడు చెరుకు శివ మాతృమూర్తి చెరుకు ఈశ్వరమ్మ జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా వారు కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గణేశ్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజన్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శేఖర్, రుద్రవీణ యువజన సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## దాతల సహకారం అభినందనీయం

**షాబాద్ ఎంపీపీ ప్రశాంతిరెడ్డి, ఎంఈవో శంకర్‌రాథోడ్**

షాబాద్, జూన్ 21 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని షాబాద్ ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, ఎంఈవో శంకర్‌రాథోడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. అదే గ్రామానికి చెందిన దాతలు ఎస్ఎంసీ మాజీ చైర్మన్ నర్సింహులు పాఠశాలకు గ్రీన్‌బోర్డు అందజేయగా, కొనింటి శేఖర్ బెంచీలకు మరమ్మతులు చేయించారు. రాజేందర్ అనే దాత పాఠశాలకు నాలుగు ఫ్యాన్లు, విద్యుత్ పనులు చేయించారు. ఓ సంస్థ వారు ఓ ల్యాప్‌టాప్, ప్రొజెక్టర్‌ను అందించారు. మధు అనే దాత విద్యార్థులకు పలకలు, నోట్‌బుక్కులు అందజేశారు. కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ లక్ష్మణ్, కాంప్లెక్స్ హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సరిత, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, పాఠశాల హెచ్ఎం సింహాద్రినాయుడు, ఉపాధ్యాయుడు హేమసుందర్ రావు, యువకులు శ్రీకాంత్, రవి, మహేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.



షాబాద్ : వెంకమ్మగూడ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్ అందజేస్తున్న ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, ఎంఈవో శంకర్‌రాథోడ్


## అక్రమ నిర్మాణాల కూల్చివేత

పెద్దఅంబర్‌పేట, జూన్ 21 : ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వెలిసిన నిర్మాణాలపై శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారం రెవెన్యూ 117 సర్వే నంబర్‌లో, కుంట్లూరు రెవెన్యూ పరిధి 24 సర్వేనంబర్‌లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను జేసీబీ సాయంతో కూల్చివేశారు. సర్కారు స్థలాల్లో నిర్మాణాలు చేపడితే సహించేది లేదని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

యాచారం, జూన్ 21 : డ్రగ్స్ రహిత సమాజమే పోలీసుల ప్రధాన లక్ష్యమని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ ఎస్ఐ ప్రసాద్ అన్నారు. మండలంలోని మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డ్రగ్స్‌పై శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రసాద్ మాట్లాడుతూ..డ్రగ్స్‌ను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా డ్రగ్స్ సరఫరా చేస్తే 87126 62111కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలి



చేవెళ్ల రూరల్, జూన్ 21 : గ్రామానికి చెందిన శ్మశానవాటిక స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కొజ్జాగూడ గ్రామస్తులు అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం వారు శ్మశానవాటిక స్థలంలో నిరసన తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. సర్వేనంబర్ 85లో 1.16 ఎకరాల స్థలం శ్మశానవాటిక కోసం వినియోగిస్తున్నామని..ఆ స్థలాన్ని గ్రామానికే చెందిన జొన్నాడ నర్సింహులు అనే వ్యక్తి తన పేరున అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపించారు. గ్రామానికే చెందిన వేణుగోపాల్ ఆ స్థలాన్ని గతంలో శ్మశానవాటికకు కేటాయించారన్నారు. రెవెన్యూ రికార్డుల్లో 1955 నుంచి ఈ భూమి శ్మశానవాటికకు కేటాయించినట్లు ఉందన్నారు. ఈ భూమే కాకుండా గ్రామంలోని ఇతర సర్వేనంబర్లలోనూ అతడి పేరున భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని..వాటిపై రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి అతడిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# ఆదిబట్లను మరింత అభివృద్ధి చేస్తాం

**ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రంగారెడ్డి



ఆదిబట్ల, జూన్ 21 : రూ.16 కోట్ల 30 లక్షలతో ఆదిబట్ల మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తామని..వెంటనే రూ.5 కోట్లతో పలు అభివృద్ధి పనులను చేపడుతామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కొంగరకలాన్ గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడంలేదని కౌన్సిలర్లు వనం శ్రీను, దాసు, మహేందర్, నాగేశ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా స్పం దించిన ఆయన వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న విద్యుత్తు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మున్సిపల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే సహించేది లేదన్నారు. గ్రామాల్లో పురాతన ఇండ్లను కూల్చి నూతనంగా నిర్మాణాలు చేపట్టిన వారిని..తాగునీటి బిల్లులు చెల్లించాలని ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని అధికారులకు సూచించారు. అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. పలు సమస్యలపై ఎమ్మెల్యేకు ఆదిబట్లవాసులు వినతిపత్రాన్ని అందజేశారు.

### స్వచ్ఛ ఆదిబట్లనే లక్ష్యం..

మున్సిపాలిటీని స్వచ్ఛ ఆదిబట్లగా మార్చడమే నా లక్ష్యమని మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. 2024-25 సంవత్సరానికి బడ్జెట్‌ను రూ.16 కోట్ల 30 లక్షలకు మున్సిపల్ సమావేశం ఆమోదించిందన్నారు. ప్రతి గ్రామంలోనూ పర్యటించి ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానన్నారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, కౌన్సిలర్లు లావణ్య, మౌనిక, సంధ్య, అర్చన, మౌనిక, కోఆప్షన్ సభ్యుడు గోపాల్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

**నేడు మంచాల సహకార సంఘం**

## చైర్మన్ ఎన్నిక

**ఏర్పాట్లు పూర్తి**



మంచాల, జూన్ 21 : మంచాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఎన్నికను శనివారం ఉదయం నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి విజయ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. గతంలో మంచాల సహకార సంఘం చైర్మన్‌గా ఉన్న పుల్లారెడ్డి అవినీతి, ఆరోపణలతో సస్పెండ్ కావడంతో.. నూతన చైర్మన్ ఎన్నిక కోసం కాంగ్రెస్ డైరెక్టర్లు క్యాంపు రాజకీయాలు నిర్వహిస్తున్నారు. ఈ సహకార సంఘంలో 12మంది డైరెక్టర్లుండగా అందులో బీజేపీకి ఇద్దరు, బీఆర్‌ఎస్‌కు నాలుగురు, కాంగ్రెస్‌కు ఐదుగురు, స్వతం త్ర్య అభ్యర్థి ఒక్కరున్నారు. అయితే బీఆర్‌ఎస్ నుంచి ఇద్దరు, స్వతంత్ర్య అభ్యర్థి ఒక్కరు కాంగ్రెస్‌లో చేరడంతో వారి సంఖ్య ఎనిమిదికి చేరింది. దీంతో చైర్మన్ పద విని దక్కించుకునేందుకు వారు ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. ఉదయం 9 నుం చి 11గంటల వరకు చైర్మన్ పదవికోసం నామినేషన్ దాఖలు, 12 నుంచి 2 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, 2.30 గంటలకు చైర్మన్‌కోసం పోటీలో ఉన్న వారి పేర్ల ప్రకటన, 3 నుంచి 5 గంటల వరకు చైర్మన్ ఎన్నికకు పోలింగ్ నిర్వహణ, 5.30 గంటలకు గెలుపొందిన చైర్మన్ పేరును అధికారులు ప్రకటించనున్నారు. కాగా చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్‌లో ఇద్దరి మధ్యే పోటీ తీవ్రంగా ఉన్నది.

## ఘనంగా ఏరువాక పౌర్ణమి

చేవెళ్లటౌన్, జూన్ 21: ఏరువాక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో అమ్మవారికి పూజలు చేసి గోమాతలకు మహానైవేద్యం సమర్పించారు.

## లాంగ్ టర్మ్ పరీక్షలకు శిక్షణ తరగతులు

షాబాద్, జూన్ 21 : సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్(ప్రిలిమ్స్ కమ్ మెయిన్స్)పరీక్షలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తరగతులు 18-07-2024 నుంచి 18-04-2025 వరకు టీజీ, బీసీ, ఈఎస్‌డీటీసీ (టీజీ, బీసీ స్టడీ సర్కిల్)లక్ష్మీనగర్ కాలనీ, సైదాబాద్, హైదరాబాద్-500059లో ప్రారంభవుతాయన్నారు. అందులో 150 మంది అభ్యర్థులకు కోచింగ్ ఇస్తారన్నారు. ముందుగా 100 మందికి 07-07-2024న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా ప్రతిభావంతులను ఎంపిక చేస్తారని.. మరో 50 మంది అభ్యర్థులను ఇంతకుముందు యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్(ప్రిలిమ్స్)పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన వారిని తీసుకుంటారన్నారు. ఎంపికైన అభ్యర్థులు 03-07-2024లోగా టీజీ, బీసీ, ఈఎస్‌డీటీసీ(టీజీ, బీసీ స్టడీ సర్కిల్)లో దరఖాస్తులను సమర్పించాలన్నారు. ప్రవేశం పొందిన అభ్యర్థులకు లాడ్జింగ్, భోజనం, రవాణా తదితర అవసరాల నిమిత్తం నెలకు రూ.5 వేలు, మరో రూ.5 వేలు బుక్‌ఫండ్‌గా ఇస్తారన్నారు. 100 మంది అభ్యర్థుల ఎంపిక కోసం 19-06-2024 నుంచి 03-07-2024 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను www.tgbcstudycircle.cgg.gov.in ద్వారా అప్‌లోడ్ చేయాలన్నారు. మరిన్ని వివరాలకు 040-24071178 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

## సివిల్ సర్వీసెస్ పరీక్షల కోచింగ్‌కు ..

షాబాద్, జూన్ 21: తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్ రంగారెడ్డి జిల్లాలో రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగలు/వెనుకబడిన తరగతులు/ఆర్థికంగా వెనుకబడిన/అంగవైకల్యం కలిగిన (పీడబ్ల్యూయూడీ) అభ్యర్థుల నుంచి సివిల్ సర్వీసెస్ పరీక్షల కోచింగ్ కోసం 100 మంది అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డిజిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రామారావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు 17-06-2024 నుంచి 10-07-2024 వరకు http://tsstudyc ircle.co.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులకు 21-07-2024న అర్హత పరీక్ష ఉంటుందన్నారు.

## 8 నుంచి గ్రూప్-2 గ్రాండ్ టెస్ట్‌లు

షాబాద్, జూన్ 21 : టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రాష్ట్రంలో పనిచేస్తున్న మొత్తం 12 టీజీబీసీ స్టడీ సర్కిళ్ల కేంద్రాల్లో టీజీపీఎస్సీ గ్రూప్-2 గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ టీజీ బీ.సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి గ్రాండ్ టెస్ట్ 08-07-2024 నుంచి 09-07-2024 వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోజుకు రెండు పేపర్ల చొప్పున రెండు రోజులపాటు నాలుగు పేపర్లకు పరీక్ష ఉంటుందన్నారు. రెండో గ్రాండ్ టెస్ట్ 15-07-2024 నుంచి 16-07-2024 వరకు నాలుగు పేపర్లు, మూడో గ్రాండ్ టెస్ట్ 22-07-2024 నుంచి 23-07-2024 వరకు నాలుగు పేపర్లు, నాలుగో గ్రాండ్ టెస్ట్ 30-07-2024 నుండి 31-07-2024 వరకు నాలుగు పేపర్లకు పరీక్షలు ఉంటాయన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను మా వెబ్‌సైట్ నుంచి ఆన్‌లైన్ ద్వారా 19-06-2024 నుండి 05-07-2024 వరకు www.tgbcstudycircle.cgg.gov.inలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 040-24071178 నంబరును సంప్రదించాలన్నారు.

# హోటళ్లు.. గబ్బుగబ్బు

ఆహార పదార్థాలు నాసిరకంగా ఉంటున్నాయని ఫిర్యాదులు రావడంతో శంషాబాద్ పట్టణంలోని పలు హోటళ్లలో శుక్రవారం మున్సిపల్ శానిటేషన్ అధికారి లక్ష్మయ్య ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. మార్క్ కిచెన్, శ్రీవెంగమాంబ, వెంగమాంబ, స్వాగత్ గ్రాండ్ హోటళ్లలో పరిశుభ్రత లేకపోవడంతోపాటు చికెన్ ఇతర పదార్థాలు నాసిరకంగా ఉన్నట్లు గుర్తించి రూ.12 వేల జరిమానా విధించారు. అలాగే బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కమిషనర్ శరత్‌చంద్ర జీషాన్ హోటల్‌ను తనిఖీ చేశారు. ఫ్రిడ్జ్‌లో కుళ్లిన మాంసంతోపాటు పాయకు ఉపయోగించే మేక కాళ్లు, చికెన్ వంటివి గుర్తించి..సీజ్ చేశారు. అనంతరం నిర్వాహకులకు పది వేల రూపాయల జరిమానా విధించారు.

-శంషాబాద్ రూరల్ /బండ్లగూడ, జూన్ 21



జీషాన్ హోటల్‌లో తనిఖీలు చేసిన బండ్లగూడ మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర